నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి

సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ ప్రభుదాస్, డీఈ రూప, ఏఈ స్రవంతి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

మల్లాపూర్, జనవరి 19: నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి నిధులు కేటాయించి అభివృద్ధి చర్యలు చేపడుతున్నామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని తిరుమల్ నగర్, హెచ్‌బీ కాలనీ గ్రౌండ్, మంగాపురం తదితర ప్రాంతాలలో సుమారు రెండు కోట్ల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్, డీఈ రూప, ఏఈ స్రవంతిలతో కలిసి ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలలో చేపట్టిన పనులను స్థానిక కార్పొరేటర్లు ఎప్పటికప్పుడు పరిశీలించి నాణ్యతా ప్రమాణాలు పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. నియోజకవర్గ పరిధిలోని పెండింగ్ అభివృద్ధి పనులపై దృష్టి సారించామని, పనులను త్వరతగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్లు చారి, వేణుగోపాల్, నాయకులు గుమ్మడి జంపాల్‌రెడ్డి, మల్లేశ్ గౌడ్, ప్రతాప్‌రెడ్డి, అశోక్‌రెడ్డిలతో పాటు కాలనీ సంక్షేమ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రజాకవి వేమన జయంత్యుత్సవాలు

ప్రజాకవి వేమన జయంతి వేడుకల్లో పాల్గొన్న స్కూల్ విద్యార్థులు

చర్లపల్లి, జనవరి 19: తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి ఆధ్వర్యంలో ప్రజాకవి వేమన జయంత్యుత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఏఎస్‌రావు నగర్ డివిజన్ కమలానగర్‌లోని ఎన్వీ భాస్కర్‌రావు భవనంలో కవి వేమన చిత్రపటానికి కేంద్రం స్ఫూర్తి బాధ్యులు గొడుగు యాదగిరి రావు, జయరాజ్, శారద, ప్రముఖ కవి బంగారు ఆచార్యులు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు లక్ష్మయ్యలు పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం, స్కూల్ విద్యార్థులకు వేమన పద్యాల పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేమన జయంతి సందర్భంగా ప్రతి సంవత్సరం స్కూల్ విద్యార్థులకు పోటీలను నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. అనంతరం స్కూల్ విద్యార్థులకు వేమన రచించిన పద్యాల పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో కేంద్రం స్ఫూర్తి సభ్యులు నాగయ్య, భాస్కర్‌రావు, శివన్నారాయణ, జయరాజు, ప్రసాద్‌బాబు, ఏఆర్వీ ప్రసాద్, శివరామకృష్ణ, థామస్, అచార్యులు, శ్రీనివాస్ రావు, ఉన్ని కృష్ణన్, బంగారు నర్సింగరావు, గౌసియా, శ్రీనివాస్‌లతో పాటు స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్ర రజక సంఘాల చైర్మన్‌గా శంకర్

శామీర్‌పేట, జనవరి 19: రజక సంఘాల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానని తెలంగాణ రాష్ట్ర రజక సంఘాల చైర్మన్ బస్వరాజు శంకర్ అన్నారు. శామీర్‌పేటలో రజక సంఘాల సమావేశం శుక్రవారం నిర్వహించి తెలంగాణ రాష్ట్ర రజక సంఘాల చైర్మన్‌గా బస్వరాజు శంకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ రజక సంఘం హక్కులకై, అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ ఆకరాజ్ శ్రీనివాస్, కొన్నె సంపత్, జయరామ్, కొట్ల శ్రీనివాస్, రమేశ్, స్వామి, కన్నయ్య, సాయిలు, రవి, ఆంజనేయులు, రాములు, సంపత్, చంద్రమౌళి పాల్గొన్నారు.

వరద ముంపు లేకుండా చర్యలు

మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

అల్వాల్ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీలోని సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

మల్కాజిగిరి, జనవరి 19: వరద ముంపు రాకుండా చర్యలు తీసుకుంటామని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. అల్వాల్ డివిజన్ ప్రశాంత్‌నగర్, రెడ్డి ఎన్‌క్లేవ్ కాలనీలలో కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డితో కలసి ఎమ్మెల్యే శుక్రవారం పాదయాత్ర చేసి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. అల్వాల్ డివిజన్ పార్టీ కార్యాలయంలో పారిశుధ్య నిర్వహణపై కార్మికులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, గత మూడు దశాబ్దాల కిందట వేసిన డ్రైనేజీ శిథిలావస్థకు చేరిందన్నారు. జన సాంద్రతకు డ్రైనేజీ కాలువలు సరిపోక పోవడంతో మురుగు రోడ్లపైన పారుతుందన్నారు. దీనికి తోడుగా వరద కాలువలు లేక పోవడంతో వరద నీరు కాలనీలను ముచ్చెత్తుతున్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. శిథిలావస్థకు చేసిన డ్రైనేజీ పైపులను తొలగించి ఆధునిక డ్రైనేజీతో పాటుగా వరద నీటి కాలువలను నిర్మిస్తామన్నారు. తాల్కాలికంగా చేస్తున్న మరమ్మతుల వల్ల ఉపయోగం ఉండదని, అధికారులతో సర్వే చేయించి నిధుల మంజూరు కోసం ప్రభుత్వానికి నివేదికలు సమర్పిస్తామని అన్నారు. నిధులు మంజూరైన వెంటనే అభివృద్ధిపనులను ప్రారంభిస్తామని అన్నారు. ఎండా కాలంలో పూర్తి స్థాయిలో నిర్మాణ పనులను చేపడతామన్నారు. ప్రజల ఆరోగ్యం కోసం పారిశుధ్య నిర్వాహణ కార్మికులు సమయపాలన పాటిస్తు సక్రమంగా జరగాలని అన్నారు. సూపర్ వైజర్లు ఉదయాన్నే కార్మికుల పనితీరును పరిశీలించాలన్నారు. మచ్చబొల్లారంలోని డంపింగ్ యార్డు నుంచి ఎప్పటికప్పుడు చెత్తను తరలించాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్ రెడ్డి, వాటర్ వర్క్స్ డీజీఎం సాంబయ్య, మేనేజర్ మల్లికార్జున్ నాయక్, ఏఈ లక్ష్మి, ఏఎంహెచ్‌ఓ డాక్టర్ మంజుల, సూపర్‌వైజర్, ప్రభాకర్, రాంకీ సంస్థ ఇన్‌చార్జిలు రామకృష్ణ రెడ్డి, సంతోష్, కాలనీ అధ్యక్షుడు నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి రవీందర్ రావు, శ్రీనివాస్, ప్రభాకర్, రాము, లక్ష్మినారాయణ, డోలి రమేష్, ఢిల్లీ పరమేష్, మల్లేష్ గౌడ్, వీఎన్ రాజు, సంజీవరెడ్డి, జార్జి, గిరి, హనుమంతు, సురేష్, రాజేందర్, మాధవి, రేణుక, శ్వేత పాల్గొన్నారు.

హయగ్రీవస్వామి ఆలయంలో పూజలు

పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బి.లక్ష్మారెడ్డి

ఉప్పల్, జనవరి 19: రామ జన్మభూమి అయోధ్య సీతారామ దేవాలయ నిర్మాణంలో భాగంగా బాల సీతారామ విగ్రహాల ప్రతిష్ఠాపన, శ్రీరామచంద్రస్వామి, లక్ష్మణస్వామి, ఆంజనేయస్వామిల విగ్రహాలను వెండితో తయారు చేసిన యజ్ఞోపవీతములను అయోధ్య రామ మందిరానికి బహూకరించనున్నారు. ఈ మేరకు ఉప్పల్‌లోని హయగ్రీవ స్వామి దేవాలయం ఆధ్వర్యంలో శుక్రవారం పూజలు నిర్వహించారు. సల్ల వీరారెడ్డి, సుధీర్‌రెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అందజేయనున్నారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం, ఆయన మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో పూజారి కన్నయ్య పంతులు, రాఘవేంద్ర పంతులు, సతీశ్, నవీన్, రాహుల్, నేతలు ఆకుల మహేందర్, బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, గంధం నాగేశ్వర్‌రావు, గోపు సదానంద్, ఎలుగేటి మోహన్‌రెడ్డి, గుడి మధుసూదన్‌రెడ్డి, పబ్బతి శేఖర్‌రెడ్డి, పాపిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సవరణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి

బోడుప్పల్, జనవరి 19: ఓటరు కార్డులో చిరునామా తప్పులను సవరించేందుకు ఈ నెల 20, 21 తేదీలలో బూత్‌స్థాయి అధికారులు అన్ని పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంటారని బోడుప్పల్ మున్సిపల్ కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఫారం–8 ద్వారా సవరణలు చేసుకోవచ్చని, ఈ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

చెరువుల సుందరీకరణకు చర్యలు

పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శాంతిసాయిజెన్ శేఖర్

ఉప్పల్, జనవరి 19: చెరువుల సుందరీకరణకు తమ వంతు తోడ్పాటును అందిస్తున్నామని నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ అన్నారు. నాచారం హెచ్‌ఎంటీనగర్ పెద్ద చెరువులో గుర్రపు డెక్క ఆకు తొలగింపు పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ గుర్రపు డెక్క అలం పెరగడంతో దోమల వ్యాప్తి పెరుగుతుందన్నారు. దోమల నివారణకు తగిన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో నేతలు సాయిజెన్ శేఖర్, మేకల ముత్యంరెడ్డి, విఠల్ యాదవ్, కట్ట బుచ్చన్న, మక్బూల్, నరసింహారావు, నరసింహ పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు యువత దూరం కావాలి

ఘట్‌కేసర్, జనవరి 19: యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి, సమాజ శ్రేయస్సు కోసం శ్రద్ధ వహించాలని పోచారం ఎస్ఐ నాగార్జున రెడ్డి కోరారు. పోచారం మున్సిపాలిటీ ఎల్ఐజీ కాలనీలో చెడు అలవాట్ల నిర్మూలనపై యువతకు అవగాహన కల్పించారు. నేడు యువత వివిధ చెడు అలవాట్లకు బానిసై బంగారు భవిష్యత్తును కోల్పోతున్నదని పేర్కొన్నారు. దీంతో తల్లిదండ్రులు పిల్లల పట్ల శ్రద్ధ వహించి ఎప్పటికప్పుడు గమనించాలని కోరారు. మత్తు, మద్యం దురలవాట్లకు యువత దూరంగా ఉండి బంగారు భవిష్యత్తును కాపాడుకోవాలన్నారు. కాలనీలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు కనిపిస్తే వివరాలడిగి 100కు డైల్ చేసి, పోచారం పోలీస్‌స్టేషన్‌కు ఫోన్‌చేసి గాని తెలియజేయాలని కోరారు. కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు, యువకులు కాలనీ వాసులు పాల్గొన్నారు.

రామంతాపూర్‌లో బాలరాముని భారీ కటౌట్

రామంతాపూర్ ప్రధాన రహదారిలో పబ్లిక్ స్కూల్ వద్ద బాలరాముని భారీ కటౌట్‌ను ఏర్పాటు చేశారు. తాళ్ల బాలకృష్ణ గౌడ్ ఏర్పాటు చేసిన ఈ కటౌట్‌ను మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కరసేవకులు ఫిలిమ్ సెన్సార్ బోర్డు మెంబర్ ముత్తినేని జగదీశ్, రేవు నర్సింహా, వేముల సోమశేఖర్ గౌడ్, వేముల వెంకట్‌రెడ్డి, కుమారస్వామి, నారాయణ దాసు, ఎల్లాచారి, మహేశ్వర్ రెడ్డి, తిరుపతయ్య, వెంపటి శ్రీనివాస్, సోమశేఖర్, అంజయ్య, వేముల వెంకన్న గౌడ్, భాస్కరాచారి, మధు, రామరాజు, అనిల్, నేరడు రమేశ్, బి.ఆనంద్, గుండె బిక్షపతి పాల్గొన్నారు.

–రామంతాపూర్, జనవరి 19

మేడిపల్లి సీఐగా ఆర్.గోవిందరెడ్డి

పీర్జాదిగూడ, జనవరి 19: మేడిపల్లి పోలీస్ స్టేషన్ సీఐగా ఆర్.గోవిందరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు రాచకొండ పోలీస్ కమిషనర్ జి.సుధీర్‌బాబు ఉత్తర్వులు జారి చేశారు. మేడిపల్లి సీఐగా పనిచేస్తున్న పి.సైదులు స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీపై వెళ్లగా ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ సీఐగా విధులు నిర్వహిస్తున్న ఆర్.గోవిందరెడ్డిని మేడిపల్లి సీఐగా నియమించారు.

ఆర్థిక ఇబ్బందులతో దంపతుల ఆత్మహత్య

మల్కాజిగిరి, జనవరి 19: ఆర్థిక ఇబ్బందులతో భార్యాభర్తలు ఆత్మహత్య చేసుకున్న ఘటన మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం, మల్లికార్జున్‌నగర్‌కు చెందిన శ్రీనివాస్(47) ప్రైవేటు ఉద్యోగిగా పనిచేస్తుంటాడు. ఇతనికి భార్య రమాదేవి(37), కూతురు సుస్మిత ఉన్నారు. కొన్ని నెలలుగా వీరు ఆరోగ్య సమస్యలతో పాటు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. గురువారం రాత్రి సుస్మిత దగ్గరలో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లి పడుకుంది. శుక్రవారం ఉదయం కూతురు ఇంటికి వచ్చి తలుపులు కొట్టగా లోపలి నుంచి ఎటువంటి జవాబు రాలేదు. అనుమానంతో కిటికీ నుంచి లోపలికి చూడగా తండ్రి శ్రీనివాస్ చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకోగా, ఆయన భార్య బెడ్‌పై శవమై ఉన్నది. వెంటనే దగ్గరలోని బంధువుకు ఫోన్ చేసింది. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని మృత దేహాలను పోలీసులు గాంధీ మార్చురీకి తరలించారు.

యువతి అదృశ్యం

జవహర్‌నగర్, జనవరి 19: ఇంటి నుంచి బటయకు వెళ్లిన యువతి అదృశ్యమైంది. ఈ ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీతారాం తెలిపిన ప్రకారం, కాప్రా మండలం శ్రీనగర్ కాలనీలో సింహాద్రి అప్పలాచారి కుటుంబ సభ్యులతో కలిసి నివాసముంటున్నాడు. అప్పలాచారి కుమార్తె లక్ష్మి అభినయ (22) ఈ నెల 17న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. లక్ష్మి కోసం చుట్టుప్రక్కలు, బంధువుల ఇండ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించ లేదు. ఈ మేరకు కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

తాళం పగులగొట్టి చోరీ

బండ్లగూడ, జనవరి 19 : కుటుంబ సభ్యులతో కలిసి షాపింగ్‌కు వెళ్లి వచ్చేసరికి దొంగలు ఇంట్లోకి ప్రవేశించి దోచుకుపోయారు. రాజేంద్రనగర్ పోలీసుల కథనం ప్రకారం, డీడీ కాలనీ నివాసి నసీర్ అహ్మద్ సివిల్ ఇంజనీర్. శుక్రవారం రాత్రి ఏడున్నర గంటల సమయంలో ఆయన ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి షాపింగ్‌కు వెళ్లాడు. తిరిగి రాత్రి 9 గంటలకు ఇంటికి వచ్చారు. తాళం పగులగొట్టి కనిపించింది. ఇంట్లోకి వెళ్లి చూడగా.. బీరువా తులుపులు విరిగిపోయి ఉన్నాయి. చోరీ జరిగినట్లు గుర్తించిన బాధితుడు, వెంటనే పోలీసులకు సమాచారమిచ్చాడు. ఇంట్లో దాచిన 35 తులాల బంగారంతో పాటు రూ.1.5 లక్షలు దోచుకుపోయారంటూ బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

గాయపడ్డ చిన్నారికి ఎమ్మెల్యే పరామర్శ

కుక్కల దాడిలో గాయపడ్డ చిన్నారి కృతిక ను ఆసుపత్రిలో పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

రామంతాపూర్, జనవరి 19: కుక్కల దాడిలో గాయపడ్డ హబ్సిగూడ డివిజన్ రాంరెడ్డినగర్‌కు చెందిన చిన్నారి కృతిక, తల్లి దండ్రులను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మలక్‌పేట యశోద ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. దాడిలో చెవి, ముఖం, ఇతర ప్రాంతాల్లో గాయాలను చూశారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బన్నాల ప్రవీణ్‌ముదిరాజ్,డివిజన్ అధ్యక్షులు డాక్టర్ బీవీ చారి, సోమిరెడ్డి, కాలేరు నవీన్, పాల్గొన్నారు.

కుక్కల బెడద లేకుండా చర్యలు

రామంతాపూర్, జనవరి 19: హబ్సిగూడ డివిజన్‌లో కుక్కల బెడదను నివారించేందుకు చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ కక్కిరేని చేతన తెలిపారు. ఏఎంఓహెచ్ డైరెక్టర్ డాక్టర్ జవీయా నాయక్, డాక్టర్ రంజిత్, డిప్యూటీ డైరెక్టర్, వెటర్నరీ అధికారులతో కలిసి మలక్‌పేట వైద్యశాలలో కుక్కల దాడిలో రాంరెడ్డినగర్‌కు చెందిన కృతిక, తల్లిదండ్రులను పరామర్శించి, కుక్కలను పట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

మలక్‌పేట వైద్యశాలలో చికిత్స పొందుతున్న కృతికను పరామర్శిస్తున్న కార్పొరేటర్ చేతన, అధికారులు.

నేడు రేపు ఓటరు నమోదు: కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ కలెక్టరేట్, జనవరి 19: శని ఆదివారాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని జిల్లాలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ఈ అవకాశాన్ని 18 ఏండ్లు నిండిన యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అధికారులతో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంపై కలెక్టర్ శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధికారులు క్షేత్రస్థాయిలో అర్హులకు ఓటు హక్కు ప్రాధాన్యతపై అవగాహన కల్పించి, ఓటరుగా నమోదు అయ్యేందుకు చొరవ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చిరునామా తదితర సవరణలను కూడా చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. బీఎల్‌వోలు పోలింగ్ కేంద్రాల్లో ఓటరు జాబిత సంబంధిత ఫారాలు 6, 8తో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారని తెలిపారు. జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ ఎన్నికల అధికారులతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికలకు సంబంధించి ఫారం 6, 7, 8లను ఈ నెల 22వ తేదీ వరకు పూర్తి చేస్తామన్నారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ విజయేంద్రరెడ్డి, డీఆర్వో హరిప్రియ, ఈఆర్వోలు పాల్గొన్నారు.

విదేశీ విద్య అవగాహన కేంద్రం

అవగాహన సెంటర్‌ను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న వాల్మీకి విదేశీ ఫారిన్ ఎడ్యుకేషన్ సీఈఓ అనుపమా దాస్, కళాశాల డైరెక్టర్ రమాకాంత్ రెడ్డి

ఘట్‌కేసర్, జనవరి 19: ఘట్‌కేసర్ మున్సిపాలిటీలోని సంస్కృతి ఇంజినీరింగ్ కళాశాలలో విదేశీ విద్య అవగాహన సెంటర్‌ను శుక్రవారం ప్రారంభించారు. కళాశాల డైరెక్టర్ ఎం.రమాకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో వాల్మీకి ఫారిన్ ఎడ్యుకేషన్ ప్రతినిధులు ఈ సెంటర్‌ను ప్రారంభించారు. వివిధ సంస్థల సహకారంతో విదేశాలకు వెళ్ళే విద్యార్థులకు ఈ సెంటర్ పూర్తి స్థాయిలో ఉపయోగపడుతున్నదని నిర్వాహకులు తెలిపారు. వాల్మీకి ఫారిన్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ ఒక లక్ష మంది విద్యార్థులకు పూర్తి స్థాయి కౌన్సెలింగ్ ఇచ్చి వివిధ ప్రముఖ విదేశీ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పించినదని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ ఉదయ్ కిరణ్, వాల్మీకి ఫారిన్ ఎడ్యుకేషన్ సొసైటీ సీఈఓ అనుమపమా దాస్, ట్రెనింగ్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ నీలం సింగ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్య రంగంలో విశిష్ట సేవలుందిస్తూ, గుండె సంబంధిత వ్యాధుల పట్ల నగరంలో అవగాహన కల్పిస్తున్న ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ ప్రమోద్ కుమార్‌ను చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి శుక్రవారం కలిశారు.

– చర్లపల్లి, జనవరి 19

నర్సరీ మొక్కలను సంరక్షించుకోవాలి

నర్సరీలో వివరాలు తెలుసుకుంటున్న డీఆర్‌డీఏ పద్మజారాణి

కీసర, జనవరి 19: నర్సరీలో పెంచుతున్న మొక్కలను చక్కగా సంరక్షించుకోవాలని డీఆర్‌డీఏ పీడీ పద్మజా రాణి తెలిపారు. కీసర మండలం గోధుమ కుంటలోని నర్సరీని శుక్రవారం పీడీ పద్మజా రాణి, స్థానిక సర్పంచ్ ఆకిటి మహేందర్ రెడ్డి, పంచాయతి కార్యదర్శి సురేశ్ రెడ్డిలతో కలిసి సందర్శించారు. నర్సరీకి సంబంధించి రికార్డును పరిశీలించి గ్రామంలోని ఎక్కడెక్కడ మొక్కలను పెంచడానికి ప్రణాళికలను సిద్ధం చేశారని పంచాయతి కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ వచ్చే జూన్‌లో నిర్వహించే హరితహారానికి సరిపడా మొక్కలను పెంచాలన్నారు. వచ్చే వర్షాకాలంలో హరితహారాన్ని ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక పంచాయతీ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మందమూల పరమేశ్వర్‌రెడ్డి

పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధం కావాలి

రామంతాపూర్, జనవరి 19: పార్లమెంట్ ఎన్నికలకు కాంగ్రెస్ శ్రేణుల కార్యకర్తలు సిద్ధం కావాలని రామంతాపూర్ ఎస్వీ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందమూల పరమేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికలలో మరోసారి కాంగ్రెస్ జెండాను ఎగువేద్దామన్నారు. కార్యక్రమంలో నాయకులు మహ్మద్ తోఫిక్, రఘుపతిరెడ్డి, తవిడబోయిన గిరిబాబు, అరుణ్, శ్రీకాంత్ యాదవ్, కోటేశ్, మహిళా అధ్యక్షురాలు సంధ్యారాణి, ముత్యాబాబు, లింగం, పూస సత్తయ్య, ముత్యాల జంగయ్య, భాస్కర్, ఉదయ్, షాఫిక్, శమ్ము, శ్రీధర్ పాల్గొన్నారు.

యువజనులు ఓటు నమోదు చేసుకోవాలి

ఘట్‌కేసర్/ జవహర్‌నగర్, జనవరి19: జనవరి 1వ తారీకు 2024 నాటికి 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని ఘట్‌కేసర్ కమిషనర్ ఎండీ సాబేర్ అలీ కోరారు. ఈ నెల 20, 21న రెండు రోజులు ఘట్‌కేసర్ మున్సిపాలిటీలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో ఓటర్ నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరు పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు నమోదు చేసుకొని ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కమిషనర్ సూచించారు.

18 ఏళ్ళు నిండిన వారు విధిగా..

18 ఏళ్ళు నిండిన యువకులు ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు కావాలని జవహర్‌నగర్ కార్పొరేషన్ కమిషనర్ రామలింగం తెలిపారు. ఈ మేరకు శని, ఆదివారం తేదీలలో ప్రత్యేకంగా పోలింగ్ కేంద్రాలలో బీఎల్ఓలు అందుబాటులో ఉంటారని, విధిగా ఓటును నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటు వజ్రాయుధం లాంటిదని, ప్రజాస్వామ్యంలో ఓటుతోనే ప్రశ్నించే తత్వం పెరుగుతుందని కమిషనర్ తెలిపారు. ఓటరు కార్డులో ఏమైనా సవరణలున్నా సరి చేసుకోవాలని పేర్కొన్నారు.

అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు

కొర్రెముల పంచాయతీని సందర్శించి రికార్డులను తనిఖీ చేస్తున్న డీపీవో రమణమూర్తి

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 19: పంచాయతీ పరిధిలో అక్రమ నిర్మాణాలు ప్రోత్సహిస్తే కఠిన చర్యలు తప్పవని మేడ్చల్ జిల్లా పంచాయతీ అధికారి రమణమూర్తి తెలిపారు. కొర్రెముల పంచాయతీని జిల్లా అధికారి శుక్రవారం సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. పంచాయతీకి సంబంధించిన ఆదాయ వ్యయాల గురించి కార్యదర్శి కవితను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాల గురించి ఆరా తీశారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు జరిగితే చర్యలు తప్పవన్నారు. ఇండ్ల నిర్మాణ అనుమతులు ఎలా ఇస్తున్నారనే విషయాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పంచాయతీ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను అరికట్టాలని, పంచాయతి నిర్వహణ సజావుగా సాగే విధంగా కృషి చేయాలని సర్పంచ్ వెంకటేశ్ గౌడ్, కార్యదర్శి కవితలకు సూచించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఉప్పల్/ నేరేడ్‌మెట్/మేడ్చల్ కలెక్టరేట్/ ఘట్‌కేసర్, జనవరి 19: విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. ఎన్‌జీఆర్ఐ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, అదే విధంగా 11 కేవీ జర్సీఫీడర్ పరిధిలో మ|| 3 గంటల నుంచి సా|| 5 గంటల వరకు, 11 కేవీ కల్యాణపురి ఫీడర్‌లో ఉ|| 10 గంటల నుంచి మ|| 12 వరకు, 11 కేవీ చిలుకానగర్ పరిధిలో మ|| 2 నుంచి సా|| 4 వరకు, 11కేవీ గౌతంనగర్ పరిధిలో 33/ 11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో మ|| 2 నుంచి సా|| 4 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇంకా 11కేవీ ఆర్కేపురం పరిధిలో ఉ|| 10 నుంచి మ|| 12 వ రకు, 11కేవీ అయ్యప్ప కాలనీ ఫీడర్‌లో ఉ|| 10 నుంచి 12 గంటల వరకు, 11 కేవీ శివానందాపురం ఫీడర్‌లో మ|| 2.30 నుంచి సా|| 4.30 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం విధించనున్నట్టు తెలిపారు. ఘట్‌కేసర్, అంకుశాపూర్ సబ్‌స్టేషన్ల పరిధిలో ఉ|| 10 నుంచి మ|| 12 వరకు, మరో మారు అంకుశాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో మ|| 2 నుంచి 4 వరకు, నాగారం పరిధిలో ఉ|| 10 నుంచి మ|| 12 గంటల వరకు, ఇంకోసారి మ|| 2 నుంచి సా|| 4గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఆయా అధికారులు తెలిపారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

కేంద్ర ఆరోగ్య శాఖ డిప్యూటీ కార్యదర్శి జీఏ రఘువంశీ

బోడుప్పల్, జనవరి19: పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర ఆరోగ్య శాఖ డిప్యూటీ కార్యదర్శి జీఏ రఘువంశీ అన్నారు. బోడుప్పల్ ఎన్టీఆర్ చౌరస్తాలో శుక్రవారం ఏర్పాటు చేసిన వికసిత భారత్ సంకల్ప్ యాత్ర పేరిట ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఆయన డిజిటల్ స్క్రీన్‌పై ప్రజలకు వివరించారు. స్థానిక ఆరోగ్య కేంద్రంలో అభా కార్డు వివరాలు నమోదు చేసుకునే ప్రక్రియను చేపట్టినట్లు వైద్యాధికారి రవి కుమార్ తెలిపారు. స్థానిక వైద్యులు, సిబ్బంది ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి నారాయణ్, డా||రవీంద్ర, డా||ప్రణీత్ పాల్గొన్నారు.

కీసర మండలం అంకిరెడ్డిపల్లిలోని జ్యోతిబా పూలే గురుకుల బీసీ సంక్షేమ విద్యార్థినులు ఆర్చరీలో చక్కటి ప్రతిభ కనబరిచారు. ఉట్నూర్‌లో జరిగిన ఇంటర్ సొసైటీ లీగ్ మ్యాచ్‌లో 200 మంది విద్యార్థులు ఆర్చరీ క్రీడల్లో పాల్గొనగా, అంకిరెడ్డిపల్లి విద్యార్థినుల జట్టు ఛాంపియన్ షిప్‌ను గెలుచుకుంది. ఈ పోటీలో అంకిరెడ్డిపల్లిలోని మహాత్మా జ్యోతిబా పూలేలోని ఉప్పల్, కుత్బుల్లాపూర్ ప్రాంతాలకు చెందిన విద్యార్థినులు స్వర్ణ, రజత, కాంస్య పతకాలను, ఇంకా ప్రశంసా పత్రాలను కైవసం చేసుకొన్నారు.



– కీసర, జనవరి 19

మనస్తాపం చెంది మహిళ ఆత్మహత్య

19 నేరేడ్‌మెట్, జనవరి 19: మనస్తాపానికి గురై జీవితంపై విరక్తి చెందిన ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన ప్రకారం, సంతోషిమాత నగర్‌లో నివాసం ఉంటున్న కామిడి సరోజ(55) తన కుమారుడితో కలిసి ఉంటుంది. అయితే, ఆమెకు కాలు, చేయి పనిచేయక తీవ్ర వేదన చెందుతోంది. కుమారుడు అరవింద్ రెడ్డి బుధవారం తన మిత్రుల వద్దకు వెళ్లి అక్కడే రాత్రి పడుకుని గురువారం ఉదయం 7గంటలకు ఇంటికి తిరిగి వచ్చాడు. అప్పటికే తల్లి ఒంటికి నిప్పంటించుకొని గాయాలతో పడిపోయింది. వెంటనే స్థానిక ప్రైవేటు దవాఖానకు తరలించగా పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారిస్తామని తెలిపారు.